# రిపబ్లిక్ హిందుస్థాన్

తెలుగు దినపత్రిక








హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 1 | 28-07-2026 | పేజీలు : 4 | వెల : 4


## లీజు ముసుగు.. 100 కోట్లకు ఎసరు!

- ఉర్దూ అకాడమీ భూములను కంపెనీకి కట్టబెట్టే కుట్ర
- మరో భారీ భూపందేరానికి సర్కార్ స్కెచ్
- క్యాబినెట్‌లో చర్చించకుండా, టెండర్లు
- పిలువకుండానే అప్పగించే ప్రయత్నం
- ప్రభుత్వ నిర్ణయంపై మైనారిటీల ఆగ్రహం
- ఉత్తర్వులను దాచి ఉంచడంపై అనుమానాలు
- వెంటనే లీజు రద్దు చేయాలని డిమాండ్

హైదరాబాద,(రిపబ్లిక్ హిందుస్థాన్): గద్దెనెక్కినప్పటి నుంచి భూముల చుట్టూ పరిభ్రమిస్తున్న కాంగ్రెస్ సర్కార్ మరో భారీ భూపందేరానికి తెరలేపింది. విలువైన స్థలాలను నచ్చిన వారికి దొడ్డిదారిలో కట్టబెడుతున్న ప్రభు త్వం కన్ను.. ఇప్పుడు ఉర్దూ అకాడమీ భూములపై పడ్డది. శేరిలింగంపల్లిలోని ఉర్దూ అకాడమీకి చెందిన సుమారు రూ.100 కోట్ల విలువైన 1.04 ఎకరం భూమిని ఎన్ఎన్ ఇన్‌ఫ్రా కంపెనీకి లీజు ముసుగులో కట్టబెట్టేందుకు సిద్ధమైనట్టు ఆరోపణలున్నాయి. నిబంధనలను కాలరాస్తూ టెండర్లు పిలువకుండా, క్యాబినెట్‌లో చర్చించకుండా షాదీఖాన నిర్మాణం పేరిట ఓ ప్రైవేట్ నిర్మాణ సంస్థకు ధారాదత్తం చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ప్రభుత్వ వైఖరిపై

మా పెద్దిని కాపాడండి..’

## యశోద ఆస్పత్రి వైద్యులతో కేసీఆర్



## దీపం వెలిగించి.. ఏసీ బోగీలో పూజలు

న్యూఢిల్లీ,(రిపబ్లిక్ హిందుస్థాన్): కదులుతున్న రైల్లోని ఏసీ బోగీలో ఒక ప్రయాణికుడు నూనె దీపాన్ని వెలిగించి మతపరమైన ఆచారాలు నిర్వహించడం నెటిజన్లఆగ్రహానికి గురైంది. కంపార్ట్‌మెంట్‌అంతటా పొగ వ్యాపించడంతోతోటి ప్రయాణికుడు ఒకరు ప్రమాదాల గురించి ఆ వ్యక్తికి వివరించడం కనిపించింది. ఈ వివరాలను జార్ఖండ్ రైల్ యూజర్స్ అనే ఖాతా ఎక్స్‌లో పోస్ట్ చేసింది. రైల్లో పొగ ఫైర్ అలారంను ప్రేరేపించవచ్చు. మంట ఉండటం అగ్ని ప్రమాదానికి దారి తీస్తుంది అని క్యాప్షన్‌లో పేర్కొన్నారు.



## 3 రోజుల పాటు భారీ వర్షాలు!

హైదరాబాద్,(రిపబ్లిక్‌హిందుస్థాన్): బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం వాయుగుండంగా మారింది. దీని ప్రభావంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. దీనివల్ల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆది, సోమ వారాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. సంగారెడ్డిలో అత్యధికంగా 7.2, కామారెడ్డి జిల్లా నాగరెడ్డిపల్లిలో 6.9, వికారాబాద్ జిల్లా మొమిన్‌పేటలో 6.4, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో 6.3, మెదక్ జిల్లా శంకరం పేటలో 6.2, భద్రాద్రి జిల్లా జూలూరుపాడులో 4.73 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. తీవ్ర వర్షాభావంతో అల్లాడుతున్న రైతులకు ఈ వర్షాలు కొంత ఊరటనిచ్చాయి. తాజాగా మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయన్న ప్రకటనతో సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్రంలో సగటున జూన్ నెలలో 13 సెంటీమీటర్లు, జూలైలో 22 సెంటీమీటర్ల వర్షం కురవాలి. గత ఏడాది ఇదే సమయానికి 33.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. కానీ, ఈ ఏడాది తొలకరి నుంచే వానలు తక్కువగా పడుతున్నాయి. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. ఈ ఏడాది జూన్‌లో 10 సెంటీమీటర్లు, జూలైలో ఇప్పటివరకు 11 సెంటీమీటర్ల వర్షమే కురిసింది. మొత్తంగా రెండు నెలల్లో 10 సెం.మీ లోటు వర్షపాతం నమోదైంది. దాదాపుగా 26 జిల్లాల్లో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ములుగు, నాగర్‌కర్నూల్, కామారెడ్డి, మెదక్, నల్లగొండ, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లోనే సాధారణ వర్షపాతం రికార్డయింది.



### హైడ్రా బాధితులకు అండగా బీఆర్ఎస్.. ..

## పేదల ఇండ్ల కూల్చివేతపై అలుపెరుగని పోరాటం

- హైడ్రా అకృత్యాలపై అలుపెరుగని పోరు
- ప్రభావిత బస్తీల్లో బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు పర్యటనలు
- బాధితుల పక్షాన ప్రభుత్వంతో సమరం
- కూల్చివేతలను అడ్డుకున్న బీఆర్ఎస్
- జనతా గ్యారేజీగా తెలంగాణ భవన్
- హైడ్రా, మూసీ కూల్చివేత బాధితుల తరఫున ప్రత్యేక లీగల్ సెల్
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో విసిరి పడేస్తామన్న కేసీఆర్



హైదరాబాద్,(రిపబ్లిక్ హిందుస్థాన్): హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఆ పోస్టు నుంచి తప్పించాలని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. హైడ్రా పేరుతో పేదల ఇండ్లపై దమనకాండ సాగించిన కాంగ్రెస్ సర్కార్ పాపం పండిందంటూ బాధితులు సంబురపడుతున్నారు. ఈ క్రమంలో బాధితులు తమకు బీఆర్ఎస్ చేసిన సాయం, అండగా నిలిచిన సందర్భాలను గుర్తుచేసుకుంటున్నారు. పెద్దలను చుట్టంగా, పేదలను శత్రువులుగా పరిగణిస్తూ హైడ్రా చేసిన అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు. లక్షల మంది పేదలు హైడ్రా దెబ్బకు నిరాశ్రయులై రోడ్డున పడ్డారు. అయితే హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ రక్షణ కవచంగా నిలిచింది. సర్కార్ విధ్వంసకాండకు వ్యతిరేకంగా పెద్ద పోరాటమే చేసింది. నిస్సహాయులుగా మిగిలిపోయిన బాధితులకు తామున్నామంటూ బాసటగా నిలిచింది. బాధితుల పక్షాన అలుపెరుగని పోరాటం చేసింది. ఏకంగా బీఆర్ఎస్ అగ్ర నాయకత్వమే రంగంలోకి దిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ శాసనసభా ఉపపక్ష నేత హరీశ్‌రావు స్వయంగా హైడ్రా కూల్చిన ఇండ్ల వద్దకు వెళ్లి బాధితులకు అండగా నిలిచారు. మరికొన్ని చోట్ల హైడ్రా బుల్డోజర్లు పేదల ఇండ్లపైకి రాకుండా బీఆర్ఎస్ రక్షణ కవచంగా నిలిచింది. పేదల ఇండ్లపై సర్కార్ విధ్వంసకాండఒక విధంగా చెప్పాలంటే హైదరాబాద్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో హైడ్రా పేరుతో కాంగ్రెస్ సర్కార్ విధ్వంసకాండకు పాల్పడింది. చెరువులు, కుంటలను కాపాడుతున్నామనే సాకుతో పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు దూసుకొచ్చాయి. ఇలా మూసీ పరీవాహక ప్రాంతాలతో పాటు అమీన్‌పూర్, పటాన్‌చెరు, మాదాపూర్, ఖాజాగూడ, నార్సింగి, మణికొండ, శంషాబాద్, బాచుపల్లి, కూకట్‌పల్లి, చందానగర్, ఉప్పల్, రాజేంద్రనగర్, బండ్లగూడ జాగీర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, షాహీన్‌నగర్ కుబా కాలనీలో పేదల ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసిందనే ఆరోపణలున్నాయి. రాత్రికిరాత్రే ఇండ్లపైకి బుల్డోజర్లు దూసుకొచ్చేవి. కష్టపడి రూపాయిరూపాయి పోగేసి నిర్మించుకున్న ఇండ్లను కండ్ల ముందే కూల్చివేశాయి. కొన్ని సందర్భాల్లో ఇండ్లలోని వస్తువులు సైతం తీసుకునే అవకాశం ఇవ్వలేదు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, హెచ్చరికలు లేకుండా ఉన్నపళంగా ఇండ్లపై పడి విధ్వంసకాండ సృష్టించాయి. అప్పటి వరకు ఉన్న గూడును చెల్లాచెదురు చేశాయి. చెరువులు, కుంటలను కబ్జాదారుల నుంచి రక్షిస్తున్నామంటూనే పేదలను హైడ్రా నరకంలోకి నెట్టేసింది. కొన్ని సందర్భాల్లో అయితే న్యాయం కోసం కోర్టులకు వెళ్లకుండా చేసిన పరిస్థితులున్నాయి. శనివారం వచ్చిందంటే చాలు.. కోర్టులకు సెలవు చూసుకొని హైడ్రా బుల్డోజర్లు పేదల ఇండ్లపైకి దూసుకొచ్చేవి. రాత్రికిరాత్రే కలల సౌధాలను నేలమట్టం చేసేవి. దిక్కుతోచని స్థితిలో పిల్లలు, పండు ముసలి వాళ్లతో బిక్కుబిక్కుమంటూ బాధితులు కాలం గడిపిన పరిస్థితులున్నాయి.

బుల్డోజర్లకు ఎదురు నిలిచిన బీఆర్ఎస్

హైడ్రా పేరుతో కాంగ్రెస్ సర్కార్ చేసిన అకృత్యాలు, అరాచకాలకు పేదలు బాధితులుగా మిగిలిపోయారు. కండ్ల ముందే కలల సౌధాలు నేలమట్టమవుతుంటే వారి రోదనలు మిన్నంటాయి. గూడు నేలకూలుతుంటే గుండెలవిసేలా ఏడ్చారు. పేదలపై కాంగ్రెస్ సర్కార్ సాగిస్తున్న దమనకాండకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పేదల పక్షాన నిలిచి పోరాడింది. హైడ్రా బుల్డోజర్లకు బీఆర్ఎస్ నేతలు ఎదురు నిలిచారు. కూల్చివేతలను అడ్డుకున్నారు. అలా పేదలకు, వారి ఇండ్లకు రక్షణ కవచంగా నిలిచారు. కేటీఆర్, హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మాధవరం కృష్ణారావు, సుధీర్‌రెడ్డి, మధుసూదనాచారి, బండారు లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి ఇలా బీఆర్ఎస్ నేతలంతా బస్తీల్లో పర్యటించి హైడ్రా బాధితులకు అండగా నిలిచారు. తామున్నామంటూ వారికి గుండె ధైర్యాన్ని కల్పించారు. బాధితులను ఓదార్చి వారి కన్నీళ్లు తుడిచారు.

ఒకవేళ కాంగ్రెస్ సృష్టించిన హైడ్రా విధ్వంసకాండను బీఆర్ఎస్ ఎదురించకపోతే పరిస్థితి మరింత దారుణంగా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ పోరాటంతో చాలా చోట్ల హైడ్రా బుల్డోజర్లు పేదల ఇండ్లపైకి వెళ్లాలంటే జంకాయి. బీఆర్ఎస్ పోరుకు ముందు విచ్చలవిడిగా ఇండ్లపై పడి అకృత్యాలు చేసిన

ముస్లిం మైనారిటీ వర్గాల్లో

**షాదీఖాన కోసం 30 ఏండ్ల లీజుకు..**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం దర్గా హుస్సేన్ షా వలీ గ్రామం సర్వే నంబర్ 29లోని ఉర్దూ అకాడమీకి చెందిన 1.04 ఎకరాలు (5220 చ. గజాలు)ను ఎన్ఎన్ ఇన్‌ఫ్రా అండ్ కన్‌స్ట్రక్షన్స్ అనే ప్రైవేట్ కంపెనీకి 30 ఏండ్లు లీజుకు ఇచ్చింది. ఇందుకు సంబంధించి గత జూలై 16న జీవో నంబర్ 20 జారీ చేసింది. ఇందులో ఉర్దూ భవనంతోపాటు షాదీఖాన, వాణిజ్య సముదాయాన్ని బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో నిర్మించనున్నది. అయితే ప్రభుత్వం ఉత్తర్వులను బహిర్గతం చేయకపోవడం మైనారిటీ వర్గాల్లో అనేక అనుమానాలు, తీవ్ర ఆందోళనలు రేకెత్తిస్తున్నది.

**నిబంధనలకు నీళ్లొదిలి.. టెండర్లు పిలువకుండానే..**

మైనారిటీ సంక్షేమ శాఖకు చెందిన స్థలాల్లో ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే బహిరంగ టెండర్లు పిలిచి తక్కువకు కోట్ చేసిన సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసిన మీదటే ఈ ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంటుంది. అదేవిధంగా కలెక్టర్ నేతృత్వంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో ముగ్గురు మతపెద్దలు లేదా ముస్లిం సంఘాల బాధ్యులు, ఉర్దూ అకాడమీ సభ్యుడితో ఏర్పాటుచేసిన కమిటీ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తుంటుంది. కానీ ప్రస్తుత రేవంత్ ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. ఆక్షన్ నిర్వహించకుండా టెండర్లు పిలువకుండా ఎన్ఎన్ ఇన్‌ఫ్రాకు స్థలాన్ని లీజుకు ఇవ్వడం వివాదానికి దారితీస్తున్నది.

**ఎన్ఎన్ ఇన్‌ఫ్రాపై ఎందుకంత ప్రేమ?**

రూ.100 కోట్ల విలువైన స్థలాన్ని చన్నైకి కంపెనీకి లీజుకు ఇవ్వడం అనేక ప్రశ్నలను రేకెత్తిస్తున్నది. సదరు కంపెనీపై సర్కార్‌కు ఎందుకంత ప్రేమ అని మైనారిటీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. మంత్రివర్గంలో చర్చించకుండా ఉత్తర్వులు ఇవ్వడంలో ఆంతర్యమేమిటని నిలదీస్తున్నాయి. దీనికి వెనుక ప్రభుత్వ పెద్దలకు ముడుపులు ముట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి ప్రస్తుత బడ్జెట్‌లో షాదీఖానల నిర్మాణానికి ప్రభుత్వం రూ.12 కోట్లు కేటాయించిందని గుర్తుచేస్తున్నారు. కానీ ఇప్పటివరకు రూపాయి కూడా విడుదల చేయకుండా ఉన్నట్టుండి అందుకు విరుద్ధంగా వ్యవహరించడం ఏమిటని మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి వాస్తవాలు వెలికితీయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు



**మొదటి పేజీ తరువాయి**



హైదరాబాద్,(ఈరోజు): పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారని తెలిసిందే. ఈ సందర్భంగా కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. 'ఏం జేస్తరో చేయండి..మా పెద్దిని కాపాడండి..' అని కేసీఆర్ ఈ సందర్భంగా వైద్యులకు చేతులెత్తి నమస్కరించారు. దేవుడున్నాడు, డాక్టర్లున్నారు.. అన్నీ సవ్యంగానే జరుగుతాయి.. గుండె చెదురొద్దు ధైర్యంగా ఉండండని పెద్ది భార్యా పిల్లలు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి చికిత్స అందుతున్న ఐసీయూ వార్డుకు చేరుకొని, డాక్టర్లతో కలిసి అక్కడ పెద్దికి అందుతున్న చికిత్స విధానాన్ని పరిశీలించారు. దాదాపు అరగంట సేపు అక్కడే నిలుచుని డాక్టర్లతో చికిత్స అందుతున్న తీరును గురించి క్షుణ్ణంగా ఆరా తీశారు.

**మరో 48 గంటలు సమయం పట్టే అవకాశం..**

కాగా పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచ స్థాయి అత్యున్నత చికిత్సను అందిస్తున్నామని, అవసరమైన మేరకు విదేశాల నుంచి కూడా డాక్టర్లతో కన్సల్టెన్సీ తీసుకుంటున్నామని డాక్టర్లు తెలిపారు. గుండె ఊపిరితిత్తులు మిగతా అవయవాలు అన్ని పని చేస్తున్నాయని.. కాకపోతే కొంత బ్రెయిన్ ఇంకా పునరుత్తేజం చెందాల్సి ఉన్నదని.. అందుకు మరో 48 గంటలు సమయం పట్టే అవకాశం ఉన్నదని డాక్టర్లు వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో పూర్తి స్థాయిలో, స్పష్టమైన నిర్దిష్ట సమాచారం ఇవ్వడానికి మరికొంత సమయం పడుతుందని తెలిపారు.

**పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడుకోవడానికి శాయశక్తులా కృషి : కేసీఆర్**

ఖర్చుకు ఏ మాత్రం వెనకాడకుండా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడుకోవడానికి పార్టీ శాయశక్తులా కృషి చేస్తుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ఐసీయూలో వైద్య చికిత్స విధానాన్ని పరిశీలించిన అనంతరం కుటుంబ సభ్యుల వద్దకు చేరుకున్న కేసీఆర్, వారికి భరోసాను, ధైర్యాన్ని అందించారు. డాక్టర్ల కృషితో, దేవుని దయతో, ప్రజల ఆశీర్వాదంతో ఆయన కోలుకుంటాడని కేసీఆర్ విశ్వాసాన్ని ప్రకటించారు. ఆందోళన చెందవద్దని భార్యాపిల్లలకు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చి గుండె ధైర్యం నింపారు. అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తామని కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చారు.దాదాపు 45 నిమిషాల పాటు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అమెరికా తదితర విదేశాల నుంచి డాక్టర్లతో మాట్లాడుతూ.. అవసరమైన సలహాలు తీసుకుంటూ, అత్యున్నత స్థాయి సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వ్యవస్థలతో, సీనియర్ డాక్టర్లతో చికిత్సను అందిస్తున్నామని డాక్టర్లు తెలిపారు. ఎప్పటికప్పుడు ఎంఆర్ఐ తదితర అవసరమైన పరీక్షలు చేస్తూ, డాక్టర్ల బృందం చేత సమావేశాలు నిర్వహించుకుంటూ నిర్ణయాలు తీసుకుంటూ, ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచే దిశగా అత్యున్నత చికిత్స అందిస్తున్నామని డాక్టర్లు తెలిపారు.తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని.. దవాఖాన డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, ఎండి ఏఎస్ రావు జెఎస్ రావు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులు భార్య స్వప్న, కొడుకు నిదర్శన్ రెడ్డి, కూతురు ధర్మిష్ఠ, అన్నలు శ్రీనివాసరెడ్డి రవీందర్ రెడ్డి, చెల్లె స్వాతి తదితరులతో మాట్లాడిన కేసీఆర్ వారిలో ధైర్యాన్ని భరోసాను నింపారు.కేసీఆర్‌తో పార్టీ ముఖ్యులు మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజయ్య, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్,పద్మారావు గౌడ్,వినోద్ కుమార్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్, పార్టీ నాయకులు గ్యాదరి బాలమల్లు, సతీష్ రెడ్డి, రజిని సాయి చంద్, పల్లె రవికుమార్, రాజాం యాదవ్, వాసుదేవరెడ్డి, గజ్జెల నగేష్, చిరుమల్ల రాకేష్, ఎర్రోళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.



హైడ్రా.. బీఆర్ఎస్ పోరుతో భయంలోకి వెళ్లింది. పేదలకు జరుగుతున్న అన్యాయాన్ని బీఆర్ఎస్ ఎదురిస్తుందని, సర్కార్ దమననీతిని ఎండగడుతుందనే భయంతో వెనక్కి తగ్గిన పరిస్థితులున్నాయి.పేదల గూడును చెదరగొడుతున్న హైడ్రాను నామరూపాల్లేకుండా చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో పడేస్తామని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించారు. కేటీఆర్, హరీశ్‌రావు సైతం ప్రకటించారు. హైడ్రా బాధితులకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టంచేశారు.

బీఆర్ఎస్ భవన్.. జనతా గ్యారేజీపేదల ఇండ్లపై కాంగ్రెస్ సర్కార్ హైడ్రా పేరుతో సృష్టించిన విధ్వంసాన్ని బీఆర్ఎస్ నిలువరించగలిగింది. బీఆర్ఎస్ కీలక నేతలు కేటీఆర్, హరీశ్‌రావు రంగంలోకి దిగి బాధితుల పక్షాన పోరాటం చేయడంతో హైడ్రా వెనక్కి తగ్గింది. అంతకు ముందు ఇష్టమొచ్చినట్టు పేదల ఇండ్లపై విరుచుకుపడ్డ హైడ్రా.. బీఆర్ఎస్ పోరాటంతో పేదల ఇండ్ల జోలికి రావాలంటే ఆలోచించే పరిస్థితి కల్పించింది. బీఆర్ఎస్ బాధితుల పక్షాన నిలిచి పోరాటం చేసింది. దీంతో హైడ్రా బాధితులు బీఆర్ఎస్ భవన్‌కు క్యూ కట్టారు. ఇక్కడికి వచ్చి కాంగ్రెస్ సర్కార్ సాగిస్తున్న దమనకాండపై వారి గోడు వెళ్లబోసుకున్నారు. రోజూ వందలాది మంది బాధితులు బీఆర్ఎస్ భవన్ గడప తొక్కేవారు. ఇలా వేల మంది కాంగ్రెస్ సర్కార్ బాధితులకు బీఆర్ఎస్ అండగా నిలిచింది. వారికి కావాల్సిన న్యాయ సహాయంతో పాటు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించింది. ఒక విధంగా బీఆర్ఎస్ భవన్ జనతా గ్యారేజీని తలపించిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.ప్రత్యేకంగా లీగల్ సెల్హైడ్రా బాధితుల్లో మెజారిటీ ప్రజలు నిరుపేదలే. తమ ఇండ్లు కూల్చివేసిన హైడ్రాకు వ్యతిరేకంగా ఏమీ చేయలేని నిస్సహాయులే. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితులు ఉన్నవాళ్లే. ఇలాంటి పరిస్థితుల్లో లక్షలు ఖర్చు చేసి హైడ్రాపై న్యాయ పోరాటం చేయడం వారికి సాధ్యంకాని పని. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ వారి పక్షాన నిలిచింది. వారికి న్యాయ సహాయం అందించేలా చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగానే హైడ్రా బాధితుల పక్షాన న్యాయ పోరాటం చేసేందుకు ప్రత్యేకంగా లీగల్ సెల్ ఏర్పాటు చేసింది. ఇందులో సీనియర్ న్యాయవాదులను, బీఆర్ఎస్ లీగల్ టీమ్ లాయర్లను భాగస్వామ్యం చేసింది. బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన లీగల్ టీమ్ హైడ్రాకు వ్యతిరేకంగా కోర్టుల్లో పేదల పక్షాన పిటిషన్లు దాఖలు చేయడం, వాదనలు వినిపించి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నది. లక్షలు ఖర్చయ్యే న్యాయ సేవలను పేదలకు బీఆర్ఎస్ ఉచితంగా అందించింది.

**లావణ్య త్రిపాఠిపై బాడీ షేమింగ్..**

**తల్లిగా మారిన తర్వాత వచ్చిన మార్పులపై ట్రోల్స్**



మెగా కోడలు, ప్రముఖ నటి లావణ్య త్రిపాఠి ఇటీవల సోషల్ మీడియాలో మరోసారి చర్చనీయాంశంగా మారారు. అయితే ఈసారి ఆమె నటించిన సినిమా వల్ల కాదు.. ప్రసవం తర్వాత శరీరంలో వచ్చిన సహజ మార్పుల కారణంగా కొందరు నెటిజన్లు చేసిన బాడీ షేమింగ్ కామెంట్లు వివాదానికి దారితీశాయి. ఈ నేపథ్యంలో లావణ్యకు మద్దతుగా అభిమానులు, పలువురు నెటిజన్లు సోషల్ మీడియాలో బలంగా స్పందిస్తున్నారు. ఇటీవల ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన లావణ్య త్రిపాఠి.. గతంతో పోలిస్తే కొంత బరువు పెరిగినట్లు కనిపించారు. దీంతో సోషల్ మీడియాలో కొందరు ఆమె రూపురేఖలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ బాడీ షేమింగ్‌కు పాల్పడ్డారు. “ఆంటీలా కనిపిస్తున్నారు” అంటూ చేసిన కామెంట్లు విమర్శలకు దారితీశాయి.ఈ ట్రోలింగ్‌పై మెగా అభిమానులతో పాటు పలువురు నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గర్భధారణ, ప్రసవం తర్వాత మహిళ శరీరంలో మార్పులు రావడం పూర్తిగా సహజమని, ప్రతి తల్లి కోలుకోవడానికి సమయం అవసరమని గుర్తుచేస్తున్నారు.

ఒక మహిళ తల్లిగా మారిన తర్వాత శరీరంలో వచ్చే సహజ మార్పులను గౌరవించాలి. అలాంటి సమయంలో ఆమె రూపాన్ని ఎగతాళి చేయడం సరికాదు అంటూ సోషల్ మీడియాలో లావణ్యకు మద్దతుగా పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. సోషల్ మీడియాలో బాడీ షేమింగ్ సంస్కృతికి ముగింపు పలకాలంటూ అనేక మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తిత్వాన్ని, ప్రతిభను పక్కనబెట్టి కేవలం శరీరాకృతిని విమర్శించడం సమాజానికి మంచిది కాదని పేర్కొంటున్నారు. ప్రస్తుతం లావణ్య త్రిపాఠికి మద్దతుగా చూబజూజూశీతీూఖుఝుఅఝుతీఅజూఫ్ష్త్రఱ వంటి పోస్టులు ట్రెండ్ అవుతున్నాయి.మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌ని ప్రేమించి వివాహం చేసుకున్న లావణ్య త్రిపాఠి.. గత ఏడాది పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. తమ కుమారుడికి 'వాయువ్ తేజ్' అని పేరు పెట్టి ప్రస్తుతం కుటుంబంతో ఆనందంగా గడుపుతున్నారు. మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కొంతకాలంగా సినిమాలకు విరామం ఇచ్చిన ఆమె.. త్వరలోనే మళ్లీ కొత్త ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. లావణ్య త్రిపాఠి 2012లో హను రాఘవపూడి దర్శకత్వంలో వచ్చిన 'అందాల రాక్షసి' చిత్రంతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయమయ్యారు. అనంతరం 'భలే భలే మగాడివోయ్', 'సోగ్గాడే చిన్నినాయనా', 'మిస్టర్', 'యుద్ధం శరణం', 'అంతరిక్షం 9000 ఖఫీూ' వంటి పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

**ఢిల్లీని అట్టుడికించి విందులా..**

**సీజేపీపై బీజేపీ ఆగ్రహం**

న్యూఢిల్లీ,(రిపబ్లిక్ హిందుస్థాన్):ంంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ)కి చెందిన ప్రముఖులు పార్టీ చేసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో ఒక వీడియో ప్రత్యక్షమయ్యింది. దీనిని చూసిన బీజేపీ నేతలు ఆగ్రహం వ్యకం చేస్తూ, సీజేపీ తీరును 'ద్వంద్వ వైఖరి'గా అభివర్ణించారు. సీజేపీ పార్టీ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెజాద్ పూనావాలా విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత సీజేపీ పెద్ద పార్టీని ఏర్పాటు చేసిందని ఆరోపించారు.ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంఘీభావం తెలుపుతున్నామనేది ఇలాగేనా? అని సీజేపీని నిలదీశారు. ఈ విమర్శలకు సీజేపీ ప్రతినిధి సౌరభ్ దాస్ సమాధానమిచ్చారు. వర్తమాన యువత ఆలోచనా విధానాన్ని ప్రభుత్వాలు అర్థం చేసుకోలేకపోతున్నాయన్నారు. తాము రోడ్లపై కూర్చొని నిరసన తెలుపగలమని, డ్యాన్స్ చేస్తూ పోరాడగలమని సమర్థించుకున్నారు. తమ తరానికి నచ్చినట్లుగా ఉండటం తెలుసని, ఇతరులు నిర్దేశించిన పద్ధతుల్లో జీవించడం రాదని పేర్కొన్నారు.



రిపబ్లిక్ హిందుస్థాన్
తెలుగు దినపత్రిక

## ఐఐటీ విద్యార్థికి రామన్న గిఫ్ట్

హైదరాబాద్,(రిపబ్లిక్ హిందుస్థాన్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తన ఔదార్యం చాటుకున్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా విద్యార్థులకు తన వంతు సహాయ, సహకారాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన సిరిసిల్ల విద్యార్థి గడదాస్ అభినవ్ తన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ-శ్రీలతతో సోమవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా అభినవ్‌ను కేటీఆర్ శాలువాతో ఘనంగా సత్కరించి ల్యాప్‌టాప్‌ను గిఫ్ట్ స్మైల్ కింద అందజేశారు. కళాశాల ఫీజు కూడా తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. చకగా చదువుకొని తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని, ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. తమ కుమారుడి విద్యాభివృద్ధికి అండగా నిలిచిన కేటీఆర్‌కు అభినవ్ తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## హైకోర్టు తీర్పుపై ఆనందహేల..

హైదరాబాద్ ,(రిపబ్లిక్ హిందుస్థాన్): హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తొలగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రజలు సంబురాలు చేసుకుంటున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం గంధంగూడ పరిధి మూసీ పరీవాహక విఘ్నేశ్వరకాలనీ ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం పటాకులు కాల్చి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కొమ్ము కాస్తూ నిరుపేద ప్రజలను రోడ్డు పాలు చేసిన అధికారిని తప్పించిందని బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. హైడ్రాను అడ్డుపెట్టుకొని వందలాది ఎకరాల భూములను పక్కదారి పట్టించే కుట్ర చేశారని ఆరోపించారు. పెద్దలను కాపాడుతూ పేదల గూడును చెరిపేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరిచి హైడ్రా పేరిట పేదల జోలికి రావొద్దని హితవు పలికారు. హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని, రంగనాథ్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. పేదల జోలికొస్తే అధికారులకైనా.. ప్రజాప్రతినిధులకైనా ఇదే గతి పడుతుందని స్పష్టంచేశారు.

## ఐదేండ్లలో రూ.450 కోట్లే విడుదల..

హైదరాబాద్,(రిపబ్లిక్ హిందుస్థాన్): ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం తెలంగాణలోని తొమ్మిది వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం కేంద్రం గత ఐదేండ్లలో కేవలం రూ.450 కోట్లే విడుదల చేసింది. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం యుటిలైజేషన్ సర్టిఫికెట్లను(యూసీ) సమర్పించినప్పటికీ, గత ఐదేండ్లలో (2019-20 నుంచి 2023-24వరకు) వెనుకబడిన జిల్లాలకు అందించాల్సిన వార్షిక రూ.450 కోట్ల ప్రత్యేక ఆర్థికసాయాన్ని ఎందుకు విడుదల చేయలేదు? ఆ నిధులను ఎప్పటిలోగా విడుదల చేసే అవకాశమున్నది? ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 కింద ఇప్పటివరకు సంవత్సరాలవారీగా తెలంగాణకు మంజూరు చేసి, విడుదల చేసిన నిధుల సమగ్ర వివరాలేంటి? అని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు సోమవారం పైవిధంగా లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఐదు విడతల్లో ఇప్పటికే రూ.2,250 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. 2021 మార్చి 31న చివరి విడతగా రూ.450 కోట్లు విడుదల చేసినట్టు తెలిపిన కేంద్ర మంత్రి..2022 నుంచి ఇప్పటివరకు ఎంత విడుదల చేశారో అనే విషయాన్ని మాత్రం వెల్లడించకపోవడం గమనార్హం.

## తుపాకీతో హల్‌చల్.. యువకుడు అరెస్ట్

ఎల్బీనగర్,(రిపబ్లిక్ హిందుస్థాన్):తుపాకీతో ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న ఓ యువకుడిని మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు.. సరూర్‌నగర్ పోలీసులతో కలిసి అరెస్ట్ చేశారు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం కథనం ప్రకారం .. సరూర్‌నగర్ శంకర్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఇమ్రాన్ అలియాస్ ఇబ్బు (22) సరూర్‌నగర్ భగత్‌సింగ్‌నగర్‌లోని బస్తీ దవాఖాన వెనుక ప్రాంతంలో ఓ కంట్రీమేడ్ రివాల్వర్‌తో పాటుగా ఓ లైవ్ రౌండ్‌తో స్థానికులను బెదిరిస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న సరూర్‌నగర్ పోలీసులతో కలిసి మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు.చెడు సవాసాలకు అలవాటుపడిన ఇమ్రాన్ .. చోరీలబాట పట్టాడు. గతంలో ఇతడిపై వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 17 కేసులు నమోదై ఉన్నాయి. గత ఏడాది రాజేంద్రనగర్‌లోని ఓ స్క్రాప్ షాపులో పనిచేసే సమయంలో బిహార్‌కు చెందిన షకీర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి.. అతడి ద్వారా రూ.40 వేలకు ఓ కంట్రీమేడ్ రివాల్వర్, ఓ రౌండ్ బుల్లెట్‌లను కొనుగోలు చేసి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం భగత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో తుపాకీతో హల్‌చల్ చేస్తూ స్థానికులను భయాందోళనలకు గురిచేస్తూ పోలీసులకు చిక్కాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నిరుడు 5 వేల మంది పిల్లల దత్తత..

న్యూఢిల్లీ ,(రిపబ్లిక్ హిందుస్థాన్): దేశంలో పిల్లలను దత్తత తీసుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ప్రతి ఏడాదీ 26 వేల మంది పిల్లల్ని దత్తత తీసుకోడానికి ప్రజలు ఆసక్తి చూపిస్తున్నా.. వారికి సరిపోయే స్థాయిలో 0 నుంచి 2 ఏండ్ల లోపు పిల్లలు ఏజెన్సీల వద్ద ఉండట్లేదు. అయినా కూడా 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి మధ్యలో అత్యధికంగా 5,022 మంది పిల్లలను దత్తత తీసుకున్నారు.గత పదేండ్ల కాలంలో ఇదే అత్యధికం అని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ తెలిపింది. 2024-25 మధ్య 4,515 మందిని దత్తత తీసుకున్నారని సీఏఆర్ఏ వెల్లడించింది. నిరుడు దత్తత తీసుకున్న వారిలో 392 మంది చిన్నారులు ప్రత్యేక అవసరాలున్న వారేనని.. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇలాంటి పిల్లల్ని దత్తత తీసుకుంటున్న వారి సంఖ్య 25 శాతం పెరిగిందని నివేదికలు చెబుతున్నాయి

# చర్చకు నోచుకోని 'ప్రశ్న పత్రాల లీకేజీ' బిల్లు

### విద్యార్థులపై పోలీసుల చర్యలను నిరసిస్తూ విపక్షాల ఆందోళన – లోక్ సభలో తీవ్ర గందరగోళం

న్యూఢిల్లీ,(రిపబ్లిక్ హిందుస్థాన్): ప్రతిపక్షాల తీవ్ర ఆందోళనలు, నినాదాల మధ్య సోమవారం లోక్‌సభ స్తంభించింది. పబ్లిక్, పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించేందుకు ఉద్దేశించిన సవరణ బిల్లుపై చర్చ జరగకుండానే సభ రోజంతా వాయిదా పడుతూ వచ్చింది. విద్యార్థులపై పోలీసులు చర్యలు చేపట్టడంపై ప్రభుత్వం నుంచి స్పందన కోరుతూ, విపక్షాలు నిరసనలను కొనసాగించాయి. సాయంత్రం 5 గంటలకు తిరిగి సమావేశమైనప్పటికీ, పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అన్యాయమైన మార్గాల నివారణ) సవరణ బిల్లు-2026పై చర్చ జరుగలేదు. విపక్షాల నిరసనల హోరు మధ్య స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ గందర గోళం

విద్యార్థులపై పోలీసులు చేపట్టిన చర్యపై హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలంటూ రాజ్యసభలో సోమవారం విపక్షాలు పట్టుబట్టడంతో కార్యకలాపాలు ఉదయం నుంచి నాలుగు సార్లు వాయిదా పడ్డాయి. సాయంత్రం 5:15 గంటలకు ఎగువసభ సమావేశం కాగా, కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు తమ నిరసనను కొనసాగించాయి. ఈ సందర్భంగా పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ ఈ అంశంపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని, సవరణ బిల్లుపై చర్చించాలని కాంగ్రెస్‌ను కోరామని చెప్పారు. అయితే ఈ చర్చకు ముందే హోం మంత్రి వచ్చి ప్రకటన చేయాలని కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేశారు. సభలో గందరగోళం నెలకొనడంతో మంగళవారం నాటికి వాయిదా పడింది.

'హోం మంత్రి క్షమాపణ చెప్పాలి'

విద్యార్థులపై పోలీసుల దాడిని ఖండిస్తూ సోమవారం పార్లమెంట్ భవన సముదాయంలో విపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. హోం మంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనల్లో సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా తదితరులు పాల్గొన్నారు. డీఎంకే ఎంపీలు వైద్య



## ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ నియామకాలు!... రెగ్యులర్ పోస్టుల భర్తీపై నిర్లక్ష్యం

హైదరాబాద్,(రిపబ్లిక్ హిందుస్థాన్): తెలంగాణ ఆర్టీసీలో రెగ్యులర్ డ్రైవర్ పోస్టుల భర్తీని పక్కకు పెట్టిన ప్రభుత్వం దొడ్డిదారిన ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకాలు చేపడుతున్నది. రెగ్యులర్ డ్రైవర్ల నియామకానికి నిరుడు సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చినా.. ఆ ప్రక్రియను డ్రైవింగ్ టెస్టుల వరకే పరిమితం చేసి.. రహస్యంగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కొత్తగా డ్రైవర్లను నియమించుకుంటున్నది. ప్రభుత్వ సూచనల మేరకు ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా రీజియన్ల వారీగా తాత్కాలిక డ్రైవర్లను నియమించేందుకు చర్యలు చేపట్టింది. ఒక హైదరాబాద్ ప్రాంతంలోనే సుమారు 200 మంది డ్రైవర్లను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన తీసుకోవడానికి ఓమ్నీలైన్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు బాధ్యత అప్పగించింది. ఇలాగే అన్ని రీజియన్లలో ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఔట్‌సోర్సింగ్‌లో నియామకాలు చేపట్టినట్టు తెలిసింది.



రెగ్యులర్ డ్రైవర్ల కంటే ఎక్కువ వేతనం తెలంగాణలోని కొన్ని రీజియన్లలో తక్షణ ప్రాతిపదికన వందలాది మంది డ్రైవర్ల నియామానికి ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, డ్రైవర్ బ్యాచ్ నంబర్, 18నెలల అనుభవం కలిగిన హెవీ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్టీఏ క్లియరెన్స్ లెటర్, కుల ధ్రువీకరణ పత్రం ఉండి.. 21 నుంచి 60 ఏండ్ల మధ్య వయస్సులు, ఎత్తు 160 సె.మీ. ఉన్నవారు అర్హులుగా పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించుకుంటున్న డ్రైవర్లకు నెలకు ప్రారంభవేతనం రూ.21,640 ఇస్తామని ప్రకటిస్తున్నారు. అయితే, నోటిఫికేషన్‌లో రెగ్యులర్ డ్రైవర్ పోస్టులకు ప్రారంభవేతనం మాత్రం కేవలం రూ.20,960గానే చూపించారు. ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లకు వేతనంతోపాటు ప్రతిరోజూ రూ.400 ఆన్‌డ్యూటీ బత్తా, ప్రతినెలా పీఎఫ్ వెసులుబాటు కూడా ఉన్నదని ప్రకటించారు.ముఖ్యంగా ప్రతినెలా 1వ తేదీనే వేతనం జమ చేస్తామని హామీలు ఇచ్చి.. రిక్రూట్‌మెంట్ ప్రక్రియను వేగంగా కొనసాగిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన జరిపే నియామకాలపై ఉన్న శ్రద్ధ.. రెగ్యులర్ నియామకాలపై చూపించడం లేదని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీలో 1000 డ్రైవర్, 743 శ్రామిక్ పోస్టుల భర్తీకి నిరుడు సెప్టెంబర్ 17న నోటిఫికేషన్ వెలువడింది. వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు ఏడాది కావొచ్చినా నియామక ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం డ్రైవర్, శ్రామిక్ పోస్టుల నియామక ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా తుది జాబితా ప్రకటించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

సిరిసిల్ల,(రిపబ్లిక్ హిందుస్థాన్): గురుకుల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విద్య అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సోమ వారం జరిగిన ప్రజావాణిలో సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో సరైన వసతులు లేవని, భోజనంలో నాణ్యత లోపించిందంటూ విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్ అర గంటలోనే చిన్నబోనాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యాలయానికి వచ్చిన జిల్లా కలెక్టర్ నేరుగా భోజన శాలకువెళ్లి భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, నాణ్యత ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. బియ్యం, పప్పులు, కోడిగుడ్లు, నూనె ఇతర ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీలను తనిఖీలు చేశారు. అక్కడి నుంచి విద్యార్థుల వసతి గదులకు వెళ్లి మరుగుదొడ్లను పరిశీలించారు. విదార్థు?లతో మాట్లాడి సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యాలయంలో నెలకొన్న సమస్యలతో పాటు నీటి సరఫరా వెంటనే పరిష్కరించాలంటూ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లాలోని వేములవాడ మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయంలో జిల్లా కలెక్టర్ ఇటీవల తనిఖీలు చేసి నిర్వహణలో లోపాలను గుర్తించారు. విచారణ నివేదిక ఆధారంగా ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్యల



పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిన్నబోనాల గురుకుల విద్యాయలం ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. విద్యాయలం అవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రతి పాఠ్యాంశం కీలకమని ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని సూచించారు. వసతులను సద్వినియోగం చేసుకుని విద్యాలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

## ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో ...

# ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం

ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసి, ప్రజలకు వారి జిల్లాల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిపై సోమవారం సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో మంత్రి సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, పాయల్ శంకర్, డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు, కోవ లక్ష్మి, రామారావు పవర్, అనిల్ జాదవ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవీందర్ నాయక్, ఆరోగ్యశ్రీ సీఈవో హనుమంతు, ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జయసింగ్ రాథోడ్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల డీఎంహెచ్‌వోలు, వివిధ ప్రభుత్వ హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, ఇతర ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు ఆసిఫాబాద్, నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, జనరల్ హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటళ్లు, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల పనితీరును మంత్రి జిల్లాల వారీగా సమీక్షించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, నిర్మాణ పనుల పురోగతి, వైద్య పరికరాలు, ప్రత్యేక వైద్య సేవల విస్తరణ తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల పనితీరు గతంతో పోలిస్తే గణనీయంగా మెరుగుపడిందని మంత్రికి తెలిపారు.

డాక్టర్లు, నర్సింగ్, ఇతర వైద్య సిబ్బంది సంఖ్య పెరగడంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా మరిన్ని సౌకర్యాలు కల్పించాలని, మౌలిక వసతులను విస్తరించాలని, కొన్ని ప్రత్యేక వైద్య విభాగాలను బలోపేతం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజన, అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు కూడా నగరంలోని ప్రజలకు అందుబాటులో ఉన్న అన్నిరకాల వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్పారు. ఐటీడీఏల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటళ్లలో దశలవారీగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికనే కాకుండా, ప్రజలు వైద్య సేవలు పొందేందుకు ప్రయాణించాల్సిన దూరాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని ఆరోగ్య మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లను అవసరానికి అనుగుణంగా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ఆదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్ జిల్లాలకు ఆదిలాబాద్ రిమ్స్‌ను ప్రధాన వైద్య కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి తెలిపారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. కార్డియాలజి, నెఫ్రాలజీ, తదితర సూపర్ స్పెషాలిటీ సేవలను ఇప్పటికే ప్రారంభించామని, భవిష్యత్తులో అన్నిరకాల వైద్య సేవలను ఇక్కడే అందుబాటులోకి తీసుకొస్తామని చెప్ఆరు. అలాగే ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ ప్రభుత్వ హాస్పిటళ్లను దశలవారీగా బలోపేతం చేసి, ప్రజలు క్లిష్టమైన చికిత్సల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల ప్రత్యేక వైద్య సేవలను ఆయా జిల్లాల్లోనే అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అటవీ ప్రాంత జిల్లాల్లో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అప్రమత్తతతో పనిచేయాలని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల డీఎంహెచ్‌వోలను మంత్రి ఆదేశించారు. జిల్లాల్లోని అన్ని హాస్పిటల్స్లో అవసరమైన మందులు, డయాగ్నస్టిక్ కిట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, వైద్య పరికరాలు తగినంత నిల్వ ఉండేలా చూడాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రతి మండలానికి ప్రభుత్వం ఒక అంబులెన్స్‌ను మంజూరు చేసిందని మంత్రి గుర్తు చేశారు. త్వరలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లకు అనుబంధంగా అదనపు అంబులెన్స్‌లను కూడా అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. 108, 102 అంబులెన్స్ సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల కారణంగా రవాణా వ్యవస్థ దెబ్బతినే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, డెలివరీ డేట్‌కు కనీసం వారం, పది రోజుల ముందే హాస్పిటళ్లలోని బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించాలని, హైరిస్క్ గర్భిణుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.





# బాల్యమిత్రుడికి డీఎస్పీ జీవన్ రెడ్డి ఘన సన్మానం

### పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు రమేష్ బాబుకు అభినందనల వెల్లువ

ఆదిలాబాద,(రిపబ్లిక్ హిందుస్థాన్):చిన్ననాటి స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనంగా ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, ఇటీవల పదవీ విరమణ పొందిన ప్రముఖ ఉపాధ్యాయుడు, రచయిత, సంఘసేవకుడు చొప్పదండి రమేష్ బాబును ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. కుటుంబ సభ్యులు, బాల్యమిత్రులు, పలువురు ప్రముఖుల సమక్షంలో ఆత్మీయ వాతావరణంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ, తమ ఇద్దరి మధ్య ఉన్న స్నేహబంధం బాల్యం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతుందని తెలిపారు. జీవితంలో ఎన్నో బంధాలు ఉన్నప్పటికీ స్నేహబంధానికి ప్రత్యేక స్థానం ఉంటుందని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచి కలిసి చదువుకుని, ఎన్నో మధుర జ్ఞాపకాలను పంచుకున్న తమ స్నేహం నేటికీ అదే ఆప్యాయతతో కొనసాగడం ఆనందంగా ఉందన్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన రమేష్ బాబును సన్మానించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సన్మానానికి స్పందించిన చొప్పదండి రమేష్ బాబు మాట్లాడుతూ, బాల్యమిత్రుడు స్వయంగా ఇంటికి వచ్చి సత్కరించడం జీవితంలో మరపురాని ఘట్టంగా నిలిచిపోతుందని అన్నారు. చిన్ననాటి మిత్రులంతా ఒకే వేదికపై కలుసుకోవడం పండుగ వాతావరణాన్ని తలపించిందని, స్నేహబంధం కాలంతో పాటు మరింత బలపడుతుందనే విషయాన్ని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ దోర్నాల సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ అంగారపు రవీందర్, ప్రముఖ పారిశ్రామికవేత్తలు రామచందర్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, కామినేని విజయ్ కుమార్, శ్రీనివాస్‌తో పాటు బాల్యమిత్రులు, ఆత్మీయులు పాల్గొని రమేష్ బాబును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. స్నేహానికి చిరునామాగా నిలిచిన ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమం హాజరైన వారందరినీ భావోద్వేగానికి గురిచేయగా, బాల్య స్నేహబంధం గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పిన అరుదైన సందర్భంగా నిలిచింది.





# ఘనంగా నిర్వహించిన కార్గిల్ విజయ్



అదిలాబాద్,(రిపబ్లిక్ హిందుస్థాన్): కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం సాధించిన చారిత్రాత్మక విజయానికి గుర్తుగా నిర్వహించే కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు మాజీ సైనికులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, విద్యావేత్తలు హాజరై కార్గిల్ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు వామన్ రెడ్డి, కృష్ణమూర్తి, శంకర్, ఎం.డి. ముజార్ హుస్సేన్లను లయన్స్ క్లబ్ అధ్యక్షులు నూటంకి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చొప్పదండి రమేష్ బాబు, లయన్స్ డి.ఎస్.ఓ దయానంద్ రెడ్డి, కాలేవార్ ప్రకాష్, భగవాన్‌దాస్, ఎంఈఓ సోమయ్య, బండారి దేవన్న, బెజ్జంకి రవీందర్, ప్రేమ్ రాజ్ గౌడ్, సుధాకర్ రెడ్డి, అన్వర్ బాయ్ తదితరులు శాలువాలు, పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు

.అనంతరం కార్గిల్ అమరవీరుల స్మారక స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి పుష్పాంజలి ఘటిస్తూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన సైనికుల త్యాగాలు ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయమని, వారి స్ఫూర్తిని యువత అలవరచుకోవాలని వక్తలు పేర్కొన్నారు.కార్గిల్ విజయ్ దివాస్ కేవలం ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదని, దేశభక్తి, ఐక్యత, త్యాగనిరతికి ప్రతీకగా నిలిచే సందర్భంగా ప్రతి ఒక్కరూ అమరవీరుల సేవలను గుర్తుంచుకోవాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ రెండు నిమిషాల మౌనం పాటించి అమరవీరులకు నివాళులర్పించారు.